మెరుగైన వైద్య సేవలు అందించాలి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: వైద్యులు, వైద్య సిబ్బంది ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్ సూర్యనగర్ కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రైవేటు ఆస్పత్రులకు ధీటుగా వైద్య సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు సేవలు అందించాలన్నారు. ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మాధవి రాణి, నర్సులు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ముంపు సమస్య లేకుండా చర్యలు చేపట్టాలి



కొత్తబస్తీలో రైల్వే కల్వర్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, రైల్వే అధికారులు

అల్వాల్: ముంపు నివారణకు చర్యలు ముమ్మరం చేయాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అధికారులకు సూచించారు. మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని కొత్తబస్తీ, జనప్రియ కాలనీలో గురువారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీల నుంచి వచ్చే మురుగు నీటితో పాటు పైనుంచి వచ్చే వరదనీటి ప్రవాహం తట్టుకోవడానికి అవసరమయ్యే కల్వర్టు విస్తరణ పనులు చేపట్టాలని రైల్వే అధికారులకు సూచించారు. రైల్వే కల్వర్టు వద్ద వరదనీరు వెళ్లేందుకు సరిపడా మార్గం లేకపోవడంతో తరచూ నీరు ఇళ్లలో చేరుతోందన్నారు. సమస్య పరిష్కారానికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఇందుకు అవసరమయ్యే చర్యలను జీహెచ్ఎంసీ, రైల్వే అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి, రైల్వే ఏడీఈ రవీంద్ర, జీహెచ్ఎంసీ ఈఈ, డీఈ, ఏఈతో పాటు స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు



కాప్రా దాబా గార్డెన్ కల్వర్టు వద్ద స్తంభాలు ఏర్పాటును పరిశీలిస్తున్న కార్పొరేటర్ స్వర్ణరాజ్

కాప్రా: దాబా గార్డెన్ సమీపంలోని కల్వర్టు వద్ద రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న పాత విద్యుత్ స్తంభాలను తొలగించి, కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. నూతన కల్వర్టు నిర్మించడంతో విద్యుత్ స్తంభాలు రోడ్డుపై ప్రమాదకరంగా మారాయి. దీంతో పలుమార్లు స్థానికుల విజ్ఞప్తితో కార్పొరేటర్ స్వర్ణరాజ్ ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించారు. అనంతరం వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా వాటి స్థానంలో నూతన స్తంభాలు ఏర్పాటు చేశారు. రూ.1.20 లక్షల నిధులతో 9.1 మీటర్ల ఎత్తుగల నాలుగు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశామని కార్పొరేటర్ స్వర్ణరాజ్ తెలిపారు. అందుకు సహకరించిన జీహెచ్ఎంసీ, విద్యుత్‌శాఖ అధికారులకు కార్పొరేటర్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్యేక చొరవతో కల్వర్టు వద్ద ప్రమాదకరంగా ఉన్న పాత విద్యుత్ స్తంభాలను తొలగించి ప్రమాదం లేకుండా నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ నరేందర్, లైన్ ఇన్‌స్పెక్టర్ కిశోర్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకుల సేవల పట్ల పూర్తిస్థాయి అవగాహన



కీసరలో రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం గోమతి, లీడ్ బ్యాంకు అధికారులు

కీసర: బ్యాంకులు అందిస్తున్న సేవల పట్ల పూర్తిస్థాయి అవగాహన కల్పించి ఆర్థిక క్రమశిక్షణను ప్రజల్లో పెంపొందించేందుకు కృషి చేయాలని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం గోమతి అన్నారు. కీసరలోని కేంద్రాన్ని ఆర్‌బీఐ, లీడ్‌బ్యాంకు అధికారులు గురువారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆడపిల్లలు భారం కావద్దనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సుకన్య యోజన పథకంలో ప్రతి ఒక్కరూ ఖాతాలను ప్రారంభించాలని కోరారు. జిల్లా లీడ్ బ్యాంకు అధికారులు సతీష్‌కుమార్, లక్ష్మీకాంత్, ఎస్ఎస్‌టీ జిల్లా కో ఆర్డినేటర్ అంబిక, కీసర ఈఎఫ్ఎల్ సభ్యులు విశ్వనాథ్, భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నాలాను పరిశీలించిన మున్సిపల్ అధికారులు



దేవరయాంజాల్‌లో నాలాను పరిశీలిస్తున్న అధికారులు

శామీర్‌పేట్: వర్షాకాలంలో నీరు నిల్వకుండా చర్యలు తీసుకునేందుకు తూంకుంట మున్సిపల్ అధికారులు ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు గురువారం కమిషనర్ వెంకటగోపాల్, ఇరిగేషన్ శాఖ అధికారులు కలిసి తూంకుంట మున్సిపాలిటీలోని పర్యటించారు. దేవరయాంజాల్‌లోని మహాలక్ష్మీ కాలనీ సమీపంలో ప్రతి సంవత్సరం వర్షాకాలంలో నాలా పొంగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో అక్కడి నాలాలను అధికారులు పరిశీలించిన సమస్యను పరిష్కరించేందుకు స్థానికులతో చర్చించారు. కార్యక్రమంలో డీఈ సునీత, ఇరిగేషన్ ఏఈ ప్రశాంత్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి ట్యాక్స్‌లు పెంచాలనుకోవడం అన్యాయం

బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు హనుమాన్

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో గృహ, వాణిజ్య ట్యాక్స్‌లు పెంచాలనుకోవడం అన్యాయమని బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు హనుమాన్ అన్నారు. మున్సిపాలిటీలో ట్యాక్స్‌లు పెంచాలని కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టనున్న తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బీజేపీ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో కమిషనర్ సాబేర్ అలీకి గురువారం వినతి పత్రం అందజేశారు. ట్యాక్స్‌లు పెంచితే పేదల తరఫున ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో మహిపాల్‌రెడ్డి, చందు, పవన్, మధుసూదన్‌రెడ్డి, వీరేశం, రవి, శివ, కిశోర్‌గౌడ్, చలపతి, పాండు, ఆంజనేయులు, పవన్‌దేవ్ గౌడ్, నరసింహారెడ్డి, జ్ఞానేశ్వర్, మహేందర్ పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతి అందజేస్తున్న బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు హనుమాన్, నాయకులు

చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయాలి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుష్మ ఆధ్వర్యంలో గురువారం మెడికల్ లెవెల్ టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన జవహర్‌నగర్ కార్పొరేషన్ కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. నట్టల నివారణ రహిత సమాజానికి ప్రతి ఒక్కరం కృషి చేద్దామన్నారు. నులిపురుగుల నివారణ మాత్రలు చిన్నారుల శారీరక ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు.

ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్‌వో ప్రభాకర్‌యాదవ్, సందీప్, ఆరోగ్య విస్తరణ అధికారి షౌకత్‌అలీ, విద్యాశాఖ, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చిన్న రాయుని చెరువు..
ఆచూకీ గల్లంతు

- రోజుకు కొంత మట్టి నింపి చెరువు కబ్జా
- మొద్దునిద్రలో సంబంధిత అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

అల్వాల్: అల్వాల్ మండల పరిధిలోని చిన్న రాయుని చెరువును కొన్ని రోజులుగా మట్టితో పూడ్చివేస్తున్నారు. ఇప్పటికే ఎకరాల కొద్ది చెరువు స్థలం ఆక్రమణలకు గురైందని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశామని, చెరువు ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలంటూ ఉన్నతాధికారులు పలుమార్లు సూచనలు చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అవి కనిపించడంలేదని, ఇటీవలే కోర్టు నుంచి న్యాయనిపుణుల బృందం చెరువు ఆక్రమణలను పరిశీలించినప్పటికీ అధికారుల పర్యవేక్షణ కరువైందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చెరువు పరివాహక ప్రాంతాలను పరిశీలించి రక్షణ చర్యలు చేపట్టాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.

బస్.. ఫిట్‌లెస్..

- స్కూల్ బస్ సామర్థ్యంపై అనుమానాలెన్నో..?
- సాధారణ తనిఖీలతో సరిపెట్టుకుంటున్న రవాణా శాఖ
- ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



కూకట్‌పల్లిలో తనిఖీలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: విద్యా సంవత్సరం ఆరంభంతో బడి బస్సులు రోడ్డెక్కాయి. అలాగే, కాలేజీ బస్సులు కూడా రోడ్డు ఎక్కుతున్నాయి. రెండు నెలల పాటు ఎటూ కదలకుండా నిలిచిపోయిన బస్సులు, వ్యాన్లు ఇకపై పూర్తిస్థాయిలో రోడ్డెక్కాయి. షెడ్డుకే పరిమితమైన వాహనాలు ఫిట్‌నెస్ పత్రాలు పొందకుండానే రోడ్డుపై తిరుగుతున్నాయి. విద్యా సంస్థల ప్రారంభానికి ముందే ఆయా బస్సులను తనిఖీ చేసి, సామర్థ్య పరీక్షలు నిర్వహించాల్సిన రవాణా శాఖ సరిగ్గా పట్టించుకోకుండా.. విద్యా సంవత్సరం ఆరంభంలో తనిఖీల పేరుతో కొన్ని వాహనాలను చెక్ చేసి చేతులు దులుపుకోవడం.. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే చర్యలు తీసుకోవడం పరిపాటిగా మారింది. విద్యా సంస్థల బస్సులు, ఇతర వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు లేకపోవడంతో సామర్థ్యం లేని బస్సులతో ఎప్పుడు.. ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వ, ప్రైవేట్ బడులు ఇలా..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 2,018 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 5,85,573 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇవి కాకుండా 385 వరకు ఇంటర్మీడియట్, ఇంజినీరింగ్, డిగ్రీ, ఇతర కాలేజీలు ఉన్నాయి. ఈ కాలేజీల్లో మరో 3.5 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 15 మండలాల పరిధిలో 13 పురపాలక సంఘాలు, 61 గ్రామపంచాయతీలు, జీహెచ్ఎంసీ పరిధిలోని ఏడు మున్సిపల్ సర్కిళ్లు ఉన్నాయి. విద్యార్థుల ప్రయాణ సౌకర్యార్థం సిటీ నలుమూలల నుంచి కూడా విద్యా సంస్థల యాజమాన్యాలు ప్రత్యేక బస్సులను నడుపుతున్నాయి. ఇప్పటికే స్కూళ్లు ప్రారంభం కాగా, త్వరలో ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఇంజినీరింగ్, ఇతర కాలేజీలు కూడా తిరిగి తెరుచుకోనున్నాయి.

ఫిట్‌నెస్‌పై..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 3,975 స్కూల్, 1600పైగా కాలేజీ బస్సులు ఉన్నాయి. వాటిలో దాదాపు 4 వేల బస్సులు మాత్రమే ఫిటెనెస్ సర్టిఫికెట్లు పొందినట్లు రవాణా శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికీ సగానికి పైగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించకపోవడంతో ఆయా బస్సుల్లో తమ పిల్లల ప్రయాణంపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

అవకాశం కల్పించినా..

గతంతో పోలిస్తే ఈసారి ఫిట్‌నెస్ తనిఖీలు నిర్వహించడం తప్పనిసరని జిల్లా రవాణా శాఖ పేర్కొంది. ఫిట్‌నెస్ గడువు ముగిసిన వాహనాలకు పెనాల్టీ చెల్లించి సామర్థ్య ధ్రువీకరణ పత్రాలు పొందాలని ఆదేశాలు జారీ చేసింది. అలాగే, వాహనాల రెన్యూవల్‌కు అవకాశం కల్పించినా.. అడ్మిషన్ బిజీలో ఉన్న విద్యా సంస్థలకు చెందిన యాజమాన్యం ఎక్కువ సంఖ్యలో ఉపయోగించుకోలేదని తెలుస్తోంది.

అధికారుల హడావుడి

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో స్కూల్, కాలేజీ బస్సులు ప్రమాణాలు పాటిస్తున్నాయా? డ్రైవర్ అనుభవజ్ఞుడేనా? సహాయకుడు ఉన్నాడా? తదితర వాటిపై ఆర్టీఏ అధికారులు తనిఖీ చేయాల్సి ఉంది. ప్రమాదాలను ముందే సామర్థ్యం, ఫిట్‌నెస్ లేని విద్యా సంస్థల వాహనాలను గుర్తించి, నియంత్రించాల్సిన అధికారులు వాటిని పాటించకుండా.. తూతూ మంత్రంగా మొక్కుబడి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రం రవాణా శాఖ అధికారులు హడావుడి చేసి, కేసుల నమోదుకు పరిమితం కావడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. విద్యాసంస్థల వాహనాల సురక్షితంపై అధికార యంత్రాంగం స్పందించి, విద్యార్థుల తల్లిదండ్రులకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది.

రూ.8.30 లక్షలతో అభివృద్ధి పనులు

శామీర్‌పేట్: శామీర్‌పేట గ్రామ పంచాయతీ పరిధిలో గురువారం రూ.8.30 లక్షల నిధులతో పలు అభివృద్ధి పనులను ఎంపీపీ యెల్లుబాయి ప్రారంభించారు. శామీర్‌పేట ఎస్‌పీఆర్ కళాశాల వద్ద ఉన్న కాలనీలో యూజీడీ నిర్మాణంతో పాటు అంగన్‌వాడీ పనులకు ఆమె భూమిపూజ చేసి ప్రారంభించారు. ఎంపీటీసీ సాయిబాబు, మండల కో ఆప్షన్ ముజీబుద్దీన్, సొసైటీ వైస్ చైర్మన్ ఐలయ్యతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు రూ.18 వేల వేతనం ఇవ్వాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రుల పరిధిలో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు రూ.18 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లోని జిల్లా వైద్యరోగ్యశాఖ కార్యాలయం ఎదుట గురువారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం)ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆశా వర్కర్లకు ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాన్ని కల్పించాలని అశోక్ కోరారు. ఆశా వర్కర్లను వేధిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్‌లో జరగకుండా చూడాలని కోరారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డీఎంహెచ్ఓ డాక్టరు రఘునాథస్వామికి అందజేశారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి ఉన్ని కృష్ణ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి హేమలత, రేవతి కళ్యాణి, జిల్లా నాయకురాళ్లు రాధా, కోమలి, భారతి, యాదమ్మ, పద్మ, మంజుల, సబియా, అనిత, ప్రవీణ, సీఐటీయూ జిల్లా నాయకులు లింగస్వామి, రాజశేఖర్, కిష్టప్ప పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగావకాశం

ఘట్‌కేసర్: నిరుద్యోగ యువకులకు టీంలీజ్, హైదరాబాద్ వరుణ్ మోటార్స్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నట్లు ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. పదో తరగతి, ఆపై ఉత్తీర్ణులైన వారు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం దరఖాస్తు చేసుకోవాలని, రూ.12–30 వేల వరకు వేతనం లభిస్తుందన్నారు.

నాణ్యమైన విద్యతోనే భవిష్యత్



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న మేయర్ జక్క వెంకట్‌రెడ్డి

మేడిపల్లి: విద్యార్థులు బాగా చదువుకుని భవిష్యత్‌లో ఉన్నతంగా రాణించాలని మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆకాంక్షించారు. బడిబాట కార్యక్రమంలో గురువారం మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ఉచిత నోట్ బుక్స్, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. కార్పొరేటర్లు బచ్చ రాజు, మధుసూదన్‌రెడ్డి, ఎంపల్లి అనంతరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బండారి రవీందర్, ఎడవల్లి రఘువర్ధన్‌రెడ్డి, లేతాకుల రఘుపతిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీనోమ్‌వ్యాలీని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు

సాక్షి, మేడ్చల్ జిల్లా: రాష్ట్రానికి కేటాయించిన 2023 బ్యాచ్‌కు చెందిన ఏడుగురు ట్రైనీ ఐఏఎస్‌లు శిక్షణలో భాగంగా గురువారం కలెక్టరేట్, జీనోమ్‌వ్యాలీని సందర్శించారు. శామీర్‌పేట మండలంలోని జీనోమ్ వ్యాలీని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు బయోలాజికల్ లిమిటెడ్ సెజ్ యూనిట్‌కు సంబంధించిన సైంటిస్టులతో వివిధ రకాల వ్యాక్సిన్ల తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఇండియన్ మెడికల్ సైన్స్ ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యతతో కూడిన వ్యాక్సిన్లను అందిస్తున్నందుకు సైంటిస్టులను ట్రైనీ ఐఏఎస్‌లు అభినందించారు. అనంతరం మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించారు. జిల్లా కలెక్టర్ గౌతమ్ వివిధ పాలన అంశాలకు సంబంధించిన సూచనలను ట్రైనీ కలెక్టర్లకు వివరించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్యను కలిశారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ శశాంక్ గోయల్ ఆదేశాల మేరకు ట్రైనీ ఐఏఎస్‌లు జిల్లాలోని రెండు ప్రదేశాలను సందర్శించారు. కార్యక్రమంలో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి నోడల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్, జిల్లా పరిశ్రమల శాఖ జేడీ పి.రవీందర్, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ డాక్టర్ వెంకట శేఖర్ పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ పనులు ప్రారంభం

ఘట్‌కేసర్: అవుషాపూర్ గోల్డర్ వ్యాలీలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.7 లక్షలతో నిర్మిస్తున్న ఇంటింటికీ తాగునీటి పైపులైన్ పనులను ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ జంగమ్మతో గురువారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇంటింటికీ తాగునీటిని సరఫరా చేయాలన్నారు. మాజీ సర్పంచ్ కావేరి, మశ్చేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఏఈ హరిణి, వెంకట్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు సుధాకర్, సందీప్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు ప్రగతి చక్ర పురస్కారాలు

మేడ్చల్: విధి నిర్వాహణలో సంస్థ విధించిన లక్ష్యాలను చేరుకున్న డ్రైవర్లు, కండక్టర్లకు సంస్థ యాజమాన్యం ప్రగతి పురస్కారాలు అందజేసి సత్కరించింది. మేడ్చల్ ఆర్టీసీ డిపోలో ఏప్రిల్ నెలలో అత్యధిక ఇన్సెంటివ్ సాధించిన కండక్టర్లు, ఇంధనం పొదుపు చేసిన డ్రైవర్లు, బ్రేక్‌డౌన్ లేకుండా నిర్వహించిన మెకానిక్‌లను డిపో అధికారులు గుర్తించి వారికి గురువారం డిపోలో ప్రగతి చక్ర పురస్కారాలు అందజేసి శాలువాలతో సన్మానించారు.

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



అల్వాల్: అల్వాల్ హిల్స్‌లోని శ్రీపద్మావతి గోదా సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి ఈ నెల 19వ తేదీ వరకు స్వామి వారి బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని ఆలయ ట్రస్టీ సభ్యులు, కాలనీ అధ్యక్షులు భూపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

లాసెట్‌లో సత్తాచాటిన మైనార్టీ గురుకుల విద్యార్థులు



అమ్మతుల్లా వాహిద్ (9వ ర్యాంక్)

మల్కాజిగిరి: మౌలాలిలోని మైనార్టీ గురుకుల కళాశాల సికింద్రాబాద్ గరల్స్–1 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కోచింగ్ తీసుకున్న విద్యార్థులు ఐదు సంవత్సరాల లాసెట్‌లో ప్రతిభచాటారు. అమ్మతుల్లా వాహిద్ 9వ ర్యాంక్, రిజ్వాన 240, శ్రావణి 439, రుబీనా 517, రమ 672, శిరీష 764 ర్యాంక్‌లు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ కవిత తెలిపారు. 9వ ర్యాంక్ సాధించిన అమ్మతుల్లా వాహిద్ తండ్రి వాహిద్ అహ్మద్ గెస్ట్ ఫ్యాకల్టిగా పనిచేస్తుండగా తల్లి ప్రైమరీ పాఠశాలలో మ్యాథ్స్ టీచర్‌గా పనిచేస్తున్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ కవిత అభినందించారు.

రాత్రీ.. పగలూ.. వెలుగులే..



జ్యోతినగర్‌లో..

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వీధి దీపాల నిర్వాహణ లోపం అధ్వానంగా ఉంది. వీధి దీపాలు పగలు, రాత్రి తేడా లేకుండా ఎప్పుడుపడితే అప్పుడు వెలుగుతుంటే అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల వీధి దీపాలు ఉన్నా వెలగడం లేదని, మరి కొన్ని చోట్ల పగలు, రాత్రి తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఒకవైపు కరెంటు కోతలు విధిస్తున్న అధికారులు పట్టపగలే వీధి దీపాలు వెలుగుతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. సిబ్బంది నిర్లక్ష్యమా.. లేక అధికారుల పర్యవేక్షణ లోపమా అని ప్రశ్నిస్తున్నారు.

నిమిషాంబదేవి 18న వార్షిక బ్రహ్మోత్సవాలు

బోడుప్పల్: పెంటారెడ్డి కాలనీలోని శ్రీమాతా నిమిషాంబదేవి అష్టాదశ 18వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 16వ తేదీన నుంచి వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు వెల్లడించారు. 16న దేవతా ప్రార్థన, గోపూజ, శాంతి మంత్ర పఠనం, విఘ్నేశ్వర పూజ, యాగశాల ప్రవేశం, అంకుర్పారణ, ప్రధాన దేవతా కలశ స్థాపన, సామూహిక చండీ హోమం, అమ్మవారికి బంగారు చీరె అలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 17వ తేదీన శ్రీచక్రార్చన, నక్షత్ర నవగ్రహ పాశుపత హోమం, నరదృష్టి నివారణకు శక్తి హోమం, మహాలక్ష్మి అనుగ్రహనార్థం హోమం, 18వ తేదీన గణపతి, శివాలయం, శ్రీరామపరివార, ఆంజనేయ దత్తాత్రేయ, సాయిబాబా, నవగ్రహ, నాగదేవత, పూర్ణాహుతి, అమ్మవారికి పంచామృత, 56 రకాల పండ్ల రసాలతో సుగంధ ద్రవ్యాలతో నిజాభిషేకం, అమ్మవారికి పల్లకీ సేవ ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



మల్లికార్జునగర్ ప్రధాన రోడ్డు మార్గంలో ట్రాన్స్‌ఫార్మర్

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని మల్లికార్జునగర్ ప్రధాన రోడ్డు మార్గంలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. సంవత్సరాల తరబడి రోడ్డు పక్కన ఎత్తు తక్కువగా ఉండటంతో రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారులు భయందోళనకు గురవుతున్నారు. అసలే వర్షాకాలం, తక్కువ ఎత్తులో ఉండి దానిచుట్టూ కంచె లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోటికి మార్చాలని కోరుతున్నారు.

ఆర్టీఐ కార్యకర్తకు ప్రాణహాని

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ ఎల్ఎన్ కాలనీకి చెందిన ఓదెల సురేష్‌బాబు సమాచార హక్కు చట్టం కార్యకర్తగా పనిచేస్తున్నాడు. అధికారులు, రాజకీయ నాయకుల అవినీతి, అరాచకాలను ప్రశ్నిస్తున్నందుకు తనపై కొందరు వ్యక్తులు హత్యాయత్నం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని రాష్ట్ర డీజీపీకి సురేష్ బాబు ఫిర్యాదు చేశారు. తన కాలనీకి చెందిన రావుల శ్రీకాంత్ తనపై ఇటీవల హత్యాయత్నం చేశాడని, వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెడుతూ బెదిరిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తనకు రక్షణ కల్పించాలని, కాలనీలో పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, రావుల శ్రీకాంత్‌పై చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరారు.

వ్యక్తి అదృశ్యం



వెంకటేశ్వర్లు(ఫైల్)

జవహర్‌నగర్: వ్యక్తి అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కాప్రా కేసీఆర్‌నగర్ కాలనీలో నివసించే పిల్లి వెంకటేశ్వర్లు(49) ఓ ప్రైవేట్ కళాశాలలో ప్రిన్సిపల్. ఆర్థిక ఇబ్బందులతో కళాశాలకు వెళ్లడం మానేసి మరో ఉద్యోగం కోసం ప్రయత్నం కొనసాగించాడు. 12వ తేదీన ఉద్యోగం కోసం స్నేహితుడి దగ్గరకు వెళ్తున్నానని చెప్పి తిరిగిరాలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేస్తున్నారు.